క్లుప్తంగా

బేకరీ ధ్వంసం

నెల్లూరు(క్రైమ్): ఆర్థిక విభేదాల నేపథ్యంలో బేకరీని ధ్వంసం చేసిన ఘటనపై కేసును దర్గామిట్ట పోలీసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. దర్గామిట్టలో జయప్రకాష్ కు చెందిన దుకాణాన్ని హరనాథ్‌రెడ్డి బాడుగకు తీసుకొని జస్ట్ బేక్ పేరుతో బేకరీని నిర్వహిస్తున్నారు. దుకాణ బాడుగ పెంపు విషయమై వీరి మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం ఈ వివాదం కోర్టులో ఉంది. ఈ తరుణంలో బేకరీని జేసీబీతో శుక్రవారం రాత్రి కొందరు ధ్వంసం చేశారు. ఘటనపై పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. రూ.45 లక్షల నుంచి రూ.50 లక్షల మేర నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. విచారణ జరుపుతున్నారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకారంలో పోలేరమ్మ

మనుబోలు: మనుబోలు కోదండరామపురంలోని పోలేరమ్మ ఆలయ ఐదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలను అర్చకుడు శ్రీనివాసులు ఆదివారం నిర్వహించారు. మంత్రోచ్చారణల మధ్య గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనం, నవగ్రహ మండపారాధన, నవావరణ పూజ, దుర్గా హోమం పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పోలేరమ్మను దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలకు పొట్టి నాగేంద్ర- అనూరాధ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయం వద్ద మహిళల కోలాటం, కందల సుస్మిత కూచిపూడి నాట్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి.

ఉచిత మెగా వైద్యశిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

పొదలకూరు: స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో నవజ్యోతి యూత్ ఆర్గనైజేషన్, ఆదిలీలా ఫౌండేషన్ ఇండియా ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరు నారాయణ వైద్యశాలకు చెందిన డాక్టర్లు రోగులకు పరీక్షలు చేసి, ఉచితంగా మందులను అందజేశారు. శిబిరానికి హాజరైన వారికి రక్త పరీక్షలను నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వైద్యశిబిరానికి హాజరై పరీక్షలు చేయించుకున్నారు.

కల్యాణ మండపంలో బాణసంచా దుకాణాలు



పొదలకూరు: దీపావళి పండగ సందర్భంగా బాణసంచా దుకాణాలను పట్టణంలోని హంస రెడ్డి కల్యాణ మండపంలో ఆదివారం ఏర్పాటు చేశారు. దుకాణాల ఏర్పాటుకు రెవెన్యూ, అగ్నిమాపక, పోలీసు అధికారులు కమిటీగా ఏర్పడి తాత్కాలిక అనుమతులిచ్చారు. బాణసంచా ఒకే ప్రాంతంలో ఏర్పాటు చేసి అమ్ముకునేందుకు మాత్రమే అనుమతి ఇచ్చారు.

బయట అమ్మితే కేసులు

బాణసంచా వ్యాపారాన్ని అనుమతి పొందిన వారు కల్యాణ మండపంలోనే అమ్మాలని మండల కమిటీ అధికారులు వెల్లడించారు. బయటి ప్రాంతాలు, గ్రామాల్లో బాణసంచా అమ్మకాలు సాగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కసుమూరులో సందడి

వెంకటాచలం: మండలంలోని కసుమూరు మస్తాన్‌వలీ దర్గా వద్ద ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వరుస సెలవుల నేపథ్యంలో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు కసుమూరుకు వచ్చి మస్తాన్‌వలీ దర్గాను దర్శించుకున్నారు. ముజావర్లు ప్రత్యేక ప్రార్థనలు చేసి భక్తులకు ప్రసాదాలను అందజేశారు.

డివైడర్‌ను ఢీకొన్న బైక్

- ఒకరికి గాయాలు

వెంకటాచలం: మోటార్ బైక్ డివైడర్‌ను ఢీకొని ఒకరు గాయపడిన ఘటన మండలంలోని కాకుటూరు సమీపంలో ఆదివారం జరిగింది. గూడూరు పట్టణానికి చెందిన రవికిరణ్ పనినిమిత్తం మోటార్ బైక్‌పై నెల్లూరుకు వెళ్తుండగా, కాకుటూరు సమీపంలో ముందుగా వెళ్తున్న ఆటో అకస్మాత్తుగా ఆగిపోవడంతో, బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రవికిరణ్‌కు గాయాలు కాగా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

నేత్రపర్వంగా రంగనాథుడి కల్యాణం



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థాన కల్యాణ మండపంలో రంగనాయకి, ఆండాళ్ అమ్మవారి సమేత రంగడి కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా ఆదివారం నిర్వహించారు. కల్యాణాన్ని కేసీ దాస్ స్మారక సేవా సంస్థ ఆధ్యాత్మిక అనుబంధ సంస్థ సనాతన ధర్మవారధి వ్యవస్థాపకుడు కల్వకొలను శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో జరిపారు. భక్తులు భారీగా హాజరై రంగనాథుడ్ని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. అన్నప్రసాదాన్ని అందజేశారు. అనంతరం కల్వకొలను శ్రీరామచంద్రమూర్తి అనుగ్రహభాషణ చేశారు. రాధాకృష్ణ, పాటూరు రవికిరణ్, నవీన్ వేములపాటి, శివప్రసాద్, పోరూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్చరీ పోటీలకు జిల్లా జట్ల ఎంపికలు



ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ నేతలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్ర ఆర్చరీ పోటీల్లో తలపడే జిల్లా ఆర్చరీ ఇండియన్ రౌండ్, రికర్వ్ రౌండ్, కాంపౌండ్ రౌండ్ జట్లను ఆదివారం ఎంపిక చేశారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపికైన వీరు నవంబర్ ఒకటి నుంచి విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారని ఆర్చరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పల్లం రెడ్డి శ్రీహర్ష, పావురాల వేణు తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(అర్బన్): ఉద్యోగుల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని ఏపీ ఎన్జీఓ జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షుడు ఆంజనేయవర్మ కోరారు. దర్గామిట్టలోని ఎన్జీఓ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సంఘ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, గ్రామ.. వార్డు సచివాలయ నోషనల్ ఇంక్రిమెంట్లు, ఉద్యోగోన్నతులు, గురుకుల పాఠశాలల్లో ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగుల వయోపరిమితిని 60 నుంచి 62 ఏళ్లకు పెంచడం తదితర సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఒక డీఏనే ప్రస్తుతానికి విడుదల చేయనున్నారని, మిగిలిన వాటిని త్వరగా మంజూరు చేయాలని కోరారు. ఏపీ ఎన్జీఓ జిల్లా కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారుపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు లక్కాకుల పెంచలయ్య, రాజేంద్ర, కిరణ్‌కుమార్, సతీష్, కృష్ణంరాజు, కృష్ణకుమార్, నగర శాఖ సభ్యులు మధు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లయ్స్ అధికారులను సస్పెండ్ చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణాకు సహకరిస్తున్న సివిల్ సప్లయ్స్ అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు షానవాజ్ డిమాండ్ చేశారు. సంతపేటలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. జిల్లాలోని కొన్ని రైస్‌మిల్లుల్లో రేషన్ బియ్యాన్ని అక్రమంగా దాచి.. సివిల్ సప్లయ్స్ అధికారుల అండదండలతో పాలిష్ చేసి ఇతర రాష్ట్రాలకు అధికార పార్టీ నేతలు తరలించి భారీగా గడిస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి కారకులపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నేతలు సుబ్బరాయుడు, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి కార్తీక మాసోత్సవాలు

నెల్లూరు(బృందావనం): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 22 నుంచి నవంబర్ 22 వరకు విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నామని ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీపావళి, పేట ఉత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నామని వివరించారు. ఆకాశ దీప ప్రారంభం, విశేష పుష్పాలంకారం, అఖండదీపారాధన తదితరాలను బుధవారం జరపనున్నామని, భక్తులు తరలిరావాలని కోరారు.

వివాహిత అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): వివాహిత అదృశ్యమైన ఘటనపై కేసును చిన్నబజార్ పోలీసులు నమోదు చేశారు. వివరాలు.. దగదర్తి మండలానికి చెందిన పావనికి బెంగళూరుకు చెందిన మల్లితో ఇటీవల వివాహమైంది. ఈ క్రమంలో దసరా నిమిత్తం వీరు దగదర్తి వచ్చారు. బెంగళూరుకు తిరిగెళ్లేందుకు గానూ నెల్లూరు ఆర్టీసీ ప్రధాన బస్టాండ్‌కు ఈ నెల ఒకటిన వచ్చారు. వాష్‌రూమ్‌కు వెళ్లిన పావని అక్కడి నుంచి అదృశ్యమయ్యారు. గాలించినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు.

దీపావళి సంబరాలు



నెల్లూరు (టౌన్): బాలాజీనగర్‌లోని నలంద స్కూల్లో దీపావళి వేడుకలను నిర్వహించారు. బాణసంచాను విద్యార్థులు కాల్చారు. విద్యాసంస్థల చైర్మన్ ముజహర్, డైరెక్టర్ ఫహీం, ప్రిన్సిపల్ వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూజా సామగ్రి వితరణ



నెల్లూరు(బృందావనం): నగరంలోని వివిధ ఆలయాల నిర్వాహకులకు ధూప, దీప నైవేద్య సామగ్రిని పొదలకూరు రోడ్డులోని మహాలక్ష్మమ్మ ఆలయంలో ధర్మసింధు ఆధ్యాత్మిక సేవా సమితి కన్వీనర్ ధన్వి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. విజయవాడలోని గన్నవరం భువనేశ్వరి పీఠ నిర్వాహకుడు కమలానందభారతి ఆశీస్సులతో కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన చెప్పారు. సభ్యులు నెల్లూరు వెంకటరత్నం, మేకల నరసింహారావు, దరిశిగుంట వెంకటేష్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): హత్యాయత్నం కేసులో ముగ్గురు నిందితులను వేదాయపాళెం పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. కేసు వివరాలను ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు వెల్లడించారు. త్యాగరాజనగర్‌లో నివాసం ఉంటున్న కిశోర్‌కుమార్ భార్య.. బుజబుజనెల్లూరుకు చెందిన రోహిణికుమార్ అలియాస్ రోహిత్‌రెడ్డి స్నేహితులు. స్నేహం విషయంలో రోహిత్‌రెడ్డిని కిశోర్, ఆమె తండ్రి మందలించారు. వారెక్కడ తనపై దాడి చేస్తారోననే అనుమానంతో రోహిత్‌రెడ్డి తన స్నేహితులు భరత్, కార్తీక్‌తో కలిసి కిశోర్ ఇంటికి శుక్రవారం అర్ధరాత్రి వెళ్లి మద్యం సీసాలతో దాడి చేశారు. గాయపడిన ఆయన్ను భార్య, స్థానికులు చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు.

చెరువనుకుంటే పొరపాటే..

- స్మార్ట్ స్ట్రీట్ బజార్ ముందు ప్రవాహం
- వ్యాపారాల్లేక బోసిపోయిన దుకాణాలు



నెల్లూరు(బారకాసు): మైపాడు రోడ్డులో ఏర్పాటు చేసిన స్మార్ట్ స్ట్రీట్ బజార్ ప్రాంతం ఆదివారం కురిసిన వర్షానికి చెరువును తలపించింది. దీంతో దుకాణాల వద్ద ఆగాలన్నా.. రాకపోకలు సాగించాలన్నా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఫలితంగా దుకాణాలు వెలవెలబోయాయి. గంట పాటు కురిసిన వర్షానికే ఇలా ఉంటే భారీగా పడితే మరెలా ఉంటుందోనని దుకాణదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగాలుంటాయా.. ఊడతాయా..?

- అయోమయంలో కంప్యూటర్ ఆపరేటర్లు
- ఆప్కాస్ ద్వారా నగరపాలక సంస్థలో 64 మంది విధులు



కమిషనర్‌ను కలిసేందుకు నిరీక్షిస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు

నెల్లూరు(బారకాసు): ఆప్కాస్ ద్వారా నెల్లూరు నగరపాలక సంస్థలో కంప్యూటర్ ఆపరేటర్లుగా చేరి విధులు నిర్వర్తిస్తున్న వారు తమ ఉద్యోగాలుంటాయా.. ఊడతాయాననే అయోమయ స్థితిలో ఉన్నారు. పరిశీలన నిమిత్తం విద్యార్హత పత్రాలను సమర్పించాలంటూ ఉత్తర్వులను కమిషనర్ నందన్ ఇటీవల జారీ చేశారు. కార్పొరేషన్లోని ఇంజినీరింగ్, రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, హౌసింగ్, హెల్త్, ఎస్టాబ్లిష్‌మెంట్, ఎలక్షన్ సెల్ తదితర విభాగాల్లో కంప్యూటర్ ఆపరేటర్లుగా 64 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఉద్యోగంలో కొనసాగాలంటే బీఎస్సీ, బీకాం కంప్యూటర్స్‌తో పాటు ఇతర కోర్సులు చేసి ఉండాలనే నిబంధనను ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విద్యార్హత పత్రాలను కమిషనర్‌కు అందజేశారు. నిబంధనల మేరకు అన్ని సవ్యంగా ఉంటేనే ఉద్యోగాల్లో కొనసాగే పరిస్థితి నెలకొంది. కార్పొరేషన్లో కంప్యూటర్ ఆపరేటర్లుగా ఏళ్లుగా కొనసాగుతున్నామని, ఉన్నట్లుండి ఇలా వ్యవహరించడమేమిటని పలువురు పేర్కొంటున్నారు. కమిషనర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచిచూడాలి.

పార్కు నిర్వహణ గాలికి



అలంకారప్రాయంగా సీసీ కెమెరాలు



ధ్వంసమైన సిమెంట్ బెంచీ

- ఆలనాపాలనా కరువై.. కళావిహీనంగా మారి
- మరమ్మతులకు గురైన వ్యాయామ పరికరాలు
- దుస్థితికి చేరిన సత్యనారాయణపురం పార్కు
- పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు

నెల్లూరు(బారకాసు): నగర ప్రజల ఆహ్లాదం కోసం దాదాపు 82 పార్కులను నగరపాలక సంస్థ, నుడా ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఒక్కో పార్కుకు రూ.20 లక్షల చొప్పున వెచ్చించి సుందరంగా తీర్చిదిద్దారు. ఇదే కోవలో ఐదో డివిజన్లోని సత్యనారాయణపురం ప్రాంతంలో పార్కును ఏర్పాటు చేసి ఆ తర్వాత గాలికొదిలారు. ఫలితంగా ఇది అధ్వానంగా మారుతోంది.

దుర్భర స్థితికి

పార్కులో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయడంలేదు. మరోవైపు వ్యాయామ పరికరాలు కొన్ని మరమ్మతులకు గురయ్యాయి. మూడు చోట్ల సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేయగా, అందులో ఒకటి వెలగడంలేదు. ఫలితంగా అంధకారం అలుముకుంటోంది. దీంతో మందుబాబులు ఎంచక్కా ఇక్కడికి చేరుకొని మద్యం సేవిస్తున్నారు. ఈ పరిణామాల క్రమంలో పార్కుకు రావాలంటేనే జంకాల్సిన పరిస్థితి నెలకొంటోంది. పార్కు చుట్టూ పిచ్చిమొక్కలు ఏపుగా పెరుగుతుండటంతో విషసర్పాల భయం వెంటాడుతోంది. దీంతో చిన్నారులను పంపేందుకు ఎవరూ సాహసం చేయడంలేదు. మద్యం బాటిళ్లు, గ్లాసులు, ధ్వంసమైన సిమెంట్ బెంచీలతో కళావిహీనంగా దర్శనమిస్తోంది.

మంత్రి ఆదేశాలు బేఖాతర్

ప్రజలకు ఉపయోగపడేలా పార్కులను తీర్చిదిద్దాలని, నిర్వహణలో ఎలాంటి లోపాల్లేకుండా చూడాలంటూ పలు సమావేశాల్లో మంత్రి నారాయణ ఆదేశాలు జారీ చేశారు. అయితే నగరపాలక సంస్థ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి పార్కును బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు.